సాక్షి
హనుమకొండ
శనివారం । 7 । జనవరి । 2023



పనికి తగిన వేతనం ఇవ్వాలి

యూనివర్సిటీల్లోని వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్న వారికి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. - 8లో▸



విజయ డెయిరీ ఉత్పత్తులనే వాడాలి

మనమంతా స్వచ్ఛమైన విజయ డెయిరీ పాలు, పాల ఉత్పత్తులనే వాడుదామని చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
$29^0/12^0$

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పొగమంచుతో కూడిన సూర్యరశ్మి ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రి పూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

9 నుంచి బీటెక్ సెకండియర్ మొదటి సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్: కేయూ పరిధి ఇంజనీరింగ్ కళాశాలల్లో బీటెక్ సెకెండియర్ మొదటి సెమిస్టర్ సీబీసీఎస్ (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) విద్యార్థులకు ఈనెల 9 నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి ఎ.రాధిక శుక్రవారం తెలిపారు. ఈనెల 9, 11, 17, 19, 21, 23, 25 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

10 నుంచి ఎంటెక్ ఫస్టియర్ రెండో సెమిస్టర్..

కేయూ పరిధిలో ఎంటెక్ ఫస్టియర్ రెండో సెమిస్టర్ (రెగ్యులర్, ఎక్స్, ఇంప్రూవ్‌మెంట్) విద్యార్థులకు ఈనెల 10 నుంచి పరీక్షలు నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ రాధిక తెలిపారు. ఈనెల 10, 12, 18, 20, 24, 27 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వారు తెలిపారు.


డిగ్రీ పరీక్షల్లో 18 మంది డీబార్

కేయూ క్యాంపస్: కేయూ పరిధి ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాలో శుక్రవారం నిర్వహించిన డిగ్రీ పరీక్షల్లో 18 మంది డీబార్ అయ్యారు. బీఏ, బీకాం, బీబీఏ, బీఎస్సీ తదితర కోర్సుల్లో 5 సెమిస్టర్ పరీక్షల్లో వివిధ పరీక్షా కేంద్రాల్లో కాపీయింగ్ చేస్తూ 18 మంది స్క్వాడ్‌లకు పట్టుబడినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ తెలిపారు.

నేడు ప్రతిభాపాటవ పరీక్ష

విద్యారణ్యపురి: జిల్లా విద్యాశాఖ, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం హనుమకొండ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో పదో తరగతి విద్యార్థులకు శనివారం సాంఘిక శాస్త్రంలో ప్రతిభాపాటవ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆఫోరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అల్గిరెడ్డి మధుసూధన్‌రెడ్డి, వడ్డెపెల్లి సతీశ్ శుక్రవారం తెలిపారు. ఇప్పటికే పాఠశాల స్థాయిలో ఎంపికైన ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులు స్కిల్ స్టార్క్ ఇంటర్నేషనల్ స్కూల్ రామారంలో నిర్వహించే ఈజిల్లా స్థాయి పరీక్షకు హాజరు కావాలన్నారు. ఉదయం 9:30 గంటల నుంచి 10:30 గంటల్లోపు హాజరుకావాలన్నారు. ఇందులో ప్రతిభ చూపిన వారిని ఈనెల 19న జరిగే రాష్ట్ర స్థాయి పరీక్షకు పంపుతామన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులను వేర్వేరుగా ఎంపిక చేస్తామని, ఈపరీక్ష అనంతరం సాంఘికశాస్త్ర బోర్డు పరీక్షలపై అవగాహన సదస్సు కూడా ఉంటుందన్నారు. అనంతరం బహుమతి ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

అర్చక ఆగమ ప్రవేశ పరీక్షలు



రామన్నపేట: రాష్ట్ర వ్యాప్తంగా అర్చకులకు నిర్వహిస్తున్న అర్చక ఆగమ ప్రవేశ పరీక్షల్లో భాగంగా వరంగల్‌లోని ఏవీవీ విద్యా సంస్థలో నిర్వహించిన పరీక్షలకు 480 మంది అర్చకులు హాజరైనట్లు దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ సునిత, సంఘ నాయకులు గంగు ఉపేంద్రశర్మ శుక్రవారం తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. శైవ, వీర శైవ, చాతాద వైష్ణవ గ్రామ దేవతలకు సంబంధించిన దేవాదాయ–ధర్మదాయ శాఖ ఆగమ పండితులు రూపొందించిన సిలబస్ ఆధారంగా సంస్కృతం, ఆగ్నికం, రఘు వంశానికి సంబంధించిన ప్రశ్నపత్రాలు ఇచ్చినట్లు తెలిపారు. ఈప్రవేశ పరీక్షలను దేవాదాయశాఖ అధికారులు పర్యవేక్షించగా.. పరీక్ష నిర్వహణను అర్చక సంఘ నాయకులు మఠం శివకుమార్, కొమ్మల్లపల్లి సంతోశ్‌కుమార్ శర్మ, తనుగుల అనిల్‌కుమార్ పరిశీలించారు.

ఫలితాల సాధనకు కృషి చేయాలి : డీఈఓ వాసంతి

కాజీపేట సెంటర్: విద్యారంగ పరిరక్షణకు, పదో తరగతిలో అత్యున్నత ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని వరంగల్ డీఈఓ వాసంతి కోరారు. శుక్రవారం టీఎస్ యూటీఎఫ్ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్లు, అధ్యాపక దర్శినులను ఆ సంఘం ప్రతినిధుల సమక్షంలో తన చాంబర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు తాటికాయల కుమార్, ప్రధాన కార్యదర్శి బద్దం వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మేకరి దామోదర్, కోశాధికారి, సి.సుజన్‌ప్రసాద్‌రావు, కార్యదర్శులు నామోజు శ్రీనివాస్, టి.లింగమూర్తి, పాక శ్రీనివాస్, ఎస్‌ఏ రవూఫ్, కే.రమేశ్, పి.కుమారస్వామి, మండలాల బాధ్యులు టీవీ సత్యనారాయణ, ఏ.వేణుమాధవ్ తదితరులున్నారు.

వెనుక'బడి'న పనులు!

- జిల్లాలో 'మన ఊరు – మన బడి'కి ఎంపికైన పాఠశాలలు 176
- 133 పాఠశాలల్లో పనుల పురోగతి
- మండలానికి రెండు చొప్పున పూర్తి చేసి మోడల్‌గా చూపాలని నిర్ణయం
- నేటితో ముగియనున్న గడువు.. పూర్తి కాని పనులు
- బిల్లులు రావేమోనని టెండర్లకు ముందుకు రాని కాంట్రాక్టర్లు



హనుమకొండలోని లష్కర్ బజార్ ప్రభుత్వ పీఎస్‌లో పనులు పూర్తి చేసి వేసిన కలర్



మడికొండ ప్రాథమిక పాఠశాలలో నిర్మాణంలో ఉన్న టాయిలెట్స్



హనుమకొండ: సుబేదారి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్మాణంలో ఉన్న టాయిలెట్స్



పనులు పూర్తైన దేవన్నపేట పాఠశాల, భవనానికి వేసిన పేయింటింగ్

> దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా సీఎం కేసీఆర్ విద్యారంగ అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నారు. 'మన ఊరు –మన బడి' పథకం ప్రారంభించి మొదటి విడత అభివృద్ధి పనులకు రూ.9427 కోట్లతో శ్రీకారం చుట్టారు. జనవరి చివరి వరకు దాదాపు అన్ని పనులు పూర్తి కావాలని ఆదేశించారు.
>
> - ఇటీవల జిల్లా సమీక్షలో టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ రావుల శ్రీధర్‌రెడ్డి

విద్యారణ్యపురి:

'మన ఊరు–మన బడి' పథకంలో భాగంగా పాఠశాలల్లో పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. హనుమకొండ జిల్లాలో మండలానికి రెండు చొప్పున 28 పాఠశాలల్లో పనులు పూర్తి చేసి మన ఊరు మన బడి మోడల్ స్కూళ్లుగా చూపెట్టేందుకు అధికారులు సిద్ధమయ్యారు. పనుల్ని ఈనెల 7 వరకు పూర్తి చేయించాలని ఇటీవల కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు సంబంధిత అధికారులను ఆదేశించారు. గడువు నేటితో ముగుస్తుంది. అయినా అందులో ఇంకొన్ని అసంపూర్తిగా ఉన్నాయి. మూడు పాఠశాలలకు మాత్రమే పేయింటింగ్‌ను పూర్తి చేశారు. 7వ తేదీ వరకు 28 పాఠశాలల్లో 20 వరకు పూర్తవగా అందులో ఎక్కువ శాతం పేయింటింగ్ వేయాల్సి ఉంది. మరో 8 పాఠశాలల్లో పనులు ఇంకా వివిధ దశల్లో ఉన్నాయి. ఇంకా వారం పది రోజులపైనే పట్టే అవకాశాలున్నట్లు తెలిసింది.

కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయి. రూ.30 లక్షల్లోపు పనులు చేపట్టిన వాటిల్లో ఎక్కువగా ఎలక్ట్రిఫికేషన్, మైనర్, మేజర్ మరమ్మతులు, టాయ్‌లెట్ల నిర్మాణాల వంటి పనులు చేపడుతున్నారు. అవి కూడా వివిధ దశల్లో ఉన్నాయి. రూ.30 లక్షల పైన పనులు చేపట్టాల్సిన హైస్కూళ్లలో కొన్నింటికి ఇంకా టెండర్ల ప్రక్రియే పూర్తి కాలేదు. నాలుగైదుసార్లు టెండర్లు పిలిచినా.. బిల్లులు వస్తాయో లేదోనన్న అనుమానంతో కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని సమాచారం.

రూ.62.1 కోట్ల కేటాయింపు

జిల్లాలో 176 పాఠశాలల్లోని పనుల కోసం రూ.62.1 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. ఇప్పటి వరకు జిల్లాలో రూ.4.30 కోట్ల నిధుల బిల్లులు ఎస్‌ఎంసీలకు అందాయి. పనులు పూర్తి చేసిన వెంటనే నిధులు అకౌంట్లలో జమ చేస్తున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు. వివిధ పాఠశాలల్లో ఎలక్ట్రిఫికేషన్, మేజర్, మైనర్ రిపేర్లు టాయ్‌లెట్స్, తాగునీటి సౌకర్యానికి సంబంధించి పనులు 90 శాతం పూర్తయ్యాయని సంబంధిత అధికారులు చెబుతున్నారు. అదనపు తరగతి గదులు, ప్రహరీ, హైస్కూళ్లలో డైనింగ్ హాల్స్ వంటి పనులు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయి. డిజిటల్ క్లాస్ రూమ్స్, తరగతి గదుల్లో బోర్డుల ఏర్పాటు, ఫర్నీచర్, పెయింటింగ్స్ తదితర పనులు నేరుగా ప్రభుత్వమే టెండర్లు పిలిచి వేరే వారితో చేయించనున్నట్లు సమాచారం. కానీ.. మండలానికి రెండు పూర్తైన మోడల్ పాఠశాలలకు పేయింటింగ్ వేయనున్నారు. హనుమకొండలోని ప్రభుత్వ లష్కర్ బజార్ ప్రాథమిక పాఠశాలలో, దేవన్నపేటలోని పాఠశాలలో పనులన్నీ పూర్తి చేసి పేయింటింగ్ వేశారు. కాగా.. ఇటీవల కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్ సంధ్యారాణి వేర్వేరుగా సంబంధిత విద్యాశాఖ, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు జనవరి 7లోగా జిల్లాలో 28 మోడల్ పాఠశాలల్లో పనులు పూర్తి చేయాలి. ఎంబీ రికార్డు చేసి బిల్స్‌ను అప్రూవల్ చేసుకోవాలి. ఎంత వరకు పనులు పూర్తవుతాయో వేచి చూడాలి.

మండలాల్లోని 'మోడల్' పాఠశాలల సంఖ్య	
ఆత్మకూరు	1
భీమదేవరపల్లి	2
దామెర	2
ధర్మసాగర్	2
ఎల్కతుర్తి	1
హనుమకొండ	4
హసన్‌పర్తి	2
ఐనవోలు	1
కమలాపూర్	2
కాజీపేట	4
నడికూడ	2
పరకాల	2
శాయంపేట	1
వేలేరు	2

ప్రత్యేక నిధులపై శ్రద్ధ

వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్

ఐనవోలు: ఐనవోలు మల్లికార్జునస్వామి ఆలయ శాశ్వత అభివృద్ధి పనులకు ఇప్పటికే ప్రణాళిక రూపొందించామని, సీఎం సహకారంతో ప్రత్యేక నిధులు రాబట్టడంపై శ్రద్ధ వహిస్తామని ఎమ్మెల్యే అరూరి రమేశ్ అన్నారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో దుప్పెల్లి మల్లికార్జున్‌రావు జ్ఞాపకార్థం దాతలు గోపీకృష్ణ, వంశీకృష్ణ సహకారంతో రూ.65 లక్షల వ్యయంతో నిర్మితమవుతున్న అన్నదాన సత్రం, 8 మంది దాతల సహకారంతో రూ.44 లక్షల వ్యయంతో నిర్మితమైన మల్లన్న సదన్‌లో 8 గదులు, జల్లు స్నానాల కోసం ఆలయ నిధులతో ఏర్పాటు చేసిన బీటీటీలను ఎమ్మెల్యే అరూరి రమేశ్ ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈనెల 13 నుంచి జాతర ప్రారంభం అవుతున్న నేపథ్యంలో భక్తుల సౌకర్యార్థం అన్ని రకాల ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ఈకార్యక్రమంలో దాతలు గోపీకృష్ణ, వంశీకృష్ణ కుటుంబ సభ్యులు, జెడ్పీ వైస్ చైర్మన్ గజ్జెల శ్రీరాములు, ఎంపీపీ మార్నేని మధుమతి ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు, స్థానిక సర్పంచ్ జన్ను కుమారస్వామి, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షురాలు ఎల్లావుల లలితా యాదవ్ పాల్గొన్నారు.



దాతల కుటుంబీకులతో కలిసి అన్నదాన సత్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అరూరి రమేశ్

ధర్మకర్తల మండలి నియామకమయ్యేనా?

ఐనవోలు: సంక్రాంతి జాతరకు ముందు ఐలోని మల్లన్న ఆలయానికి ధర్మకర్తల మండలి నియామకం అవుతుందా లేదా? అని మల్లన్న భక్తులు వేచి చూస్తున్నారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ చట్టం 30/1987 అనుసరించి గత నెల 15న ధర్మకర్తల మండలికి నోటిఫికేషన్ విడుదలైంది. గురువారంతో గడువు ముగిసింది. దరఖాస్తుదారుల అర్హతలు, ఇతరత్రా అంశాల్ని చట్టంలో సూచించినట్లుగా అధికారులు వెరిఫై చేసుకుని ఎండోమెంట్ కమిషనర్‌కు, ప్రభుత్వానికి నివేదిక అందించాలి. నివేదిక ఆధారంగా ప్రభుత్వం జీఓ విడుదల చేసి ట్రస్టు బోర్డు కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈనెల 13 నుంచి జాతర మొదలు కానుండగా.. ఈప్రక్రియ అంతా ముగిసి ధర్మకర్తల మండలి నియామకం అవుతుందా.. లేదా? అని మండలంలో చర్చించుకుంటున్నారు.

పలు అనుమానాలు..

గతంలో ఎప్పుడూ లేని విధంగా కమిటీ నియామక ప్రక్రియ మండలంలో చర్చనీయాంశంగా మారింది. గతంలో నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత 30 రోజుల పాటు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఉండగా.. ఈసారి 20 రోజులకు కుదించారు. కమిటీ నియామక ఉత్తర్వులు రేపోమాపో వస్తాయని ప్రచారం జరుగుతుండడం, ఈసారి ఆలయం నుంచి పారితోషికం తీసుకునేవారికి ధర్మకర్తల మండలిలో చోటు కల్పిస్తున్నట్లు విస్తృతంగా ప్రచారం జరగడం పలు అనుమానాలకు తావిస్తోంది. దరఖాస్తు చేసుకునే గడువు ముగియడంతో నిబంధనల ప్రకారం అన్ని అర్హతలను అధికారులు పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తారా? లేక నాలుగు గోడల మధ్య నివేదిక రూపొందిస్తారా? అనేది వేచి చూడాలి.



మల్లికార్జునస్వామి ఆలయం వ్యూ

'మోత'పై వాత!

- 65 డెసిబెల్ శబ్దం దాటితే జరిమానా
- హైదరాబాద్ మాదిరిగా గ్రేటర్ వరంగల్‌లో స్పెషల్ డ్రైవ్‌లు
- ప్రజారోగ్యంపై ప్రభావం చూపే వీటిపై సీపీ రంగనాథ్ ఫోకస్



సాక్షి, వరంగల్: గ్రేటర్ వరంగల్‌లో వాహనాల రద్దీ పెరుగుతోంది. అందుకనుగుణంగా హారన్‌ల మోత మోగుతోంది. ఇదంతా ట్రైసిటీలో ధ్వని కాలుష్యం పెరిగేందుకు కారణమవుతోంది. ఈ క్రమంలో నగరవాసుల ఆరోగ్యంపై ప్రభావం చూపే సౌండ్ పొల్యూషన్‌పై కఠినంగా ఉండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ నిర్ణయించారు. ముఖ్యంగా ఎన్‌ఫీల్డ్, బుల్లెట్‌తోపాటు లారీలు, బస్సులు, ప్రైవేట్ వాహనాల హారన్ల మోత ఎక్కువగా ఉందని ఇటీవల వివిధ ప్రాంతాల్లో సీపీ పర్యటించిన సందర్భంలో గుర్తించారు. ఫ్యాన్సీ హారన్లు, ఎయిర్ హారన్లు, మల్టీ టోన్ హారన్లు, మాడిఫైడ్ సైలెన్సర్ల వల్లనేనని తేల్చారు. అందుకే నిర్దేశిత డెసిబెల్ మించి సౌండ్ చేసే వాహనాలకు కూడా చలాన్లు విధించాలని నిర్ణయించారు. ఈ మేరకు సౌండ్ లెవల్ మీటర్స్(ఎస్‌ఎల్‌ఎం) సహకారంతో వివిధ ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని ట్రాఫిక్ సిబ్బందికి సీపీ రంగనాథ్ దిశానిర్దేశం చేశారు. సైబరాబాద్, హైదరాబాద్ తరహాలో గ్రేటర్ వరంగల్‌లో కూడా ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టడం వల్ల సౌండ్ పొల్యూషన్ తగ్గుతుందన్నారు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ చెప్పిన ప్రకారం.. 65 డెసిబెల్ దాటితే శబ్ద కాలుష్యం అవుతుంది. 75 డెసిబెల్ దాటితే హానికరం, 120 డెసిబెల్ దాటితే నరకమని చెప్పింది. దీనిద్వారా హృదయ సంబంధ వ్యాధులు వచ్చే అవకాశముంది. ధ్వని తీవ్రత 65 డెసిబెల్ దాటితే అందుకు అనుగుణంగా వాహనదారులకు జరిమానా విధించనున్నారు.

ఎలా లెక్కిస్తారంటే..

- వాహనానికి ఐదు నుంచి ఆరు మీటర్ల దూరంలో సౌండ్ లెవల్ మీటర్స్(ఎస్‌ఎల్‌ఎం) యంత్రాలు ఉంచి ధ్వని స్థాయిని సైంటిఫిక్‌గా లెక్కిస్తారు. వాహన సైలెన్సర్ లేదా హారన్‌ను చెక్ చేస్తారు.
- వాహనదారులను ఆపి వారి వాహనం యాక్సిలేటర్ తొక్కమని చెప్పి.. కొంత దూరంలో ఎస్‌ఎల్‌ఎం యంత్రం ఉంచి లెక్కిస్తారు. సౌండ్ సెన్సర్ల ద్వారా ధ్వని తీవ్రత స్థాయిని గుర్తిస్తారు.
- వాహనదారులను హారన్ ప్రెస్ చేయమనడం ద్వారా ఎస్‌ఎల్‌ఎం యంత్రం సహాయంతో మల్టీ టోన్స్, ఎయిర్ హారన్, కంపెనీ ఫిక్స్ చేసిన హారనా అని తేలుస్తారు.
- వాహనానికి 12 ఫీట్ల దూరం నుంచి ఎస్‌ఎల్‌ఎం యంత్రం ధ్వని తరంగాలను గుర్తిస్తుంది. ఒకవేళ 65 డెసిబెల్ దాటితే చలాన్లు జారీ చేస్తారు. ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున జరిమానా విధిస్తారు.

ఎందుకిలా చేస్తున్నారంటే..

- రోడ్లపై వెళ్తున్న ప్రజల దృష్టిని తమవైపునకు తిప్పుకునేందుకు ఎన్‌ఫీల్డ్ బైకర్లు సైలెన్సర్లను మాడిఫైడ్ చేసుకోవడాన్ని గుర్తించారు. ఇవి 90 నుంచి 120 డెసిబెల్ మధ్య సౌండ్ చేస్తున్నట్లుగా అధ్యయనంలో తేలింది.
- బస్సులు, ప్రైవేట్ వాహనాలు, లారీల హారన్ కూడా కఠోరంగా ఉంది. 1988 మోటార్ వెహికిల్ యాక్ట్ సెక్షన్ 52 ప్రకారం తయారీదారులు ఇచ్చిన ప్రకారమే వాహనాలు ఉండాలని, ఇవి అతిక్రమించే ఆయా వాహనాల్లో ఏమైనా మార్పులు చేస్తే ఎంవీ యాక్ట్ అండర్ సెక్షన్ ఆఫ్ 190(2) ప్రకారం చట్టరీత్యా చర్యలు తీసుకునే అధికారం ఉంది. ఈ మేరకు స్పెషల్ డ్రైవ్‌లు చేపట్టనున్నారు.

మాడిఫై చేస్తే కఠిన చర్యలు..

> గ్రేటర్ వరంగల్‌లో రోజుకు లక్షకుపైగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. వాహనదారులు ఎట్టి పరిస్థితుల్లో తమ వాహనాన్ని మాడిఫై చేయించుకోవద్దు. ఇలా యాక్సిలేటర్లు మార్చడం ద్వారా సౌండ్ విపరీతంగా వచ్చే అవకాశముంది. మల్టీ టోన్స్, ఎయిర్ హారన్ల ద్వారా ధ్వని తీవ్రత ఎక్కువగా ఉంటుంది. ఫలితంగా విపరీత ధ్వని ద్వారా ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపే పరిస్థితి ఉంది. అందుకే సౌండ్ పొల్యూషన్ చేసే వాహనదారులపై కఠిన చర్యలు తీసుకుంటాం. స్పెషల్ డ్రైవ్‌లతో గుర్తించి వారి ఆటకట్టిస్తాం.
>
> - ఏవీ రంగనాథ్, వరంగల్ పోలీస్ కమిషనర్

ఎక్స్‌ప్రెస్ హైవేకు భూములివ్వం

దామెర: నూతనంగా నిర్మించనున్న నాగ్‌పూర్–విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేకు తాము భూములివ్వమని రైతులు డ్రోన్ సర్వేను అడ్డుకొని నిరసన వ్యక్తం చేశారు. దామెర మండలం ఊరుగొండ సమీపంలో డ్రోన్ సర్వే నిర్వహించేందుకు గుజరాత్‌కు చెందిన ఇన్ఫినిటీ సంస్థకు చెందిన ప్రతినిధులు శుక్రవారం ఉదయం పసరగొండ క్రాస్ వద్దకు చేరుకున్నారు. కాగా.. విషయం తెలుసుకున్న భూ నిర్వాసితులు సర్వే చేయకుండా డ్రోన్ కెమెరాను అడ్డుకుని వారితో వాగ్వాదానికి దిగారు. సర్వేకు ఎలాంటి అనుమతులతో వచ్చారో, తగిన ఆధారాలు, పత్రాలు చూపించాలని నిలదీశారు. దీంతో తమ వద్ద ఎలాంటి పత్రాలు లేవని సర్వే బృందం తెలపడంతో రైతులు ఆగ్రహించారు. కొంత మంది రైతులు ఆగ్రహంతో ప్రతినిధుల వాహనాల టైర్లలో గాలి తీసి వెళ్లకుండా అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న పరకాల రూరల్ సీఐ శ్రీనివాసరావు, ఎస్సై అనిల్‌కుమార్ ఘటనా స్థలికి చేరుకొని రైతులకు నచ్చజెప్పారు. రైతులు స్వాధీనం చేసుకున్న డ్రోన్ కెమెరాను తీసుకొని సర్వే బృందానికి అప్పగించి పంపించారు. 163 జాతీయ రహదారిపైకి చేరుకొని ధర్నా నిర్వహించేందుకు రైతులు ప్రయత్నించగా.. పోలీసులు వారిని అక్కడి నుంచి పంపించారు.



నిరసన వ్యక్తం చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న పోలీసులు

జీపీడీపీ ప్రోగ్రాం ప్రణాళికపై అవగాహన



మాట్లాడుతున్న డీపీఓ జగదీశ్

శాయంపేట: గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ప్రణాళిక (జీపీడీపీ)పై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసమావేశానికి డీపీఓ జగదీశ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. జీపీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ప్రణాళిక ముఖ్య ఉద్దేశ్యాన్ని వివరించారు. ఆన్‌లైన్‌లో ఎలా పొందుపర్చాలి? 15వ ఫైనాన్స్, ప్రణాళిక ఎలా తయారు చేయాలో వివరించారు. ఈకార్యక్రమంలో డీఎల్పీఓ కల్పన, ఎంపీడీఓ ఆమంచ కృష్ణమూర్తి, ఎంపీఓ రంజిత్‌కుమార్, ఐదు మండలాల పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

ఎట్టకేలకు ఆందోళన విరమణ

ఎంజీఎం: ఎంజీఎం ఆస్పత్రి 300 ఓసీఎస్ పద్దు కింద 16 మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని మూడ్రోజులుగా కార్మికులు చేస్తున్న ఆందోళన శుక్రవారం ముగిసింది. 16మందిని విధుల్లోకి తీసుకున్నట్లు ఎంజీఎం పరిపాలన అధికారులు ఒప్పుకోవడంతో కార్మికులు ఆందోళన విరమించారు. 300 ఓసీఎస్ పద్దు కింద 35 పోస్టులు మంజూరు కాగా.. నిబంధనలకు అనుగుణంగా 19 మంది నియామకం చేపట్టారు. మిగతా 16 మంది నియామకాల్లో రాజకీయ ఒత్తిళ్లు, పరిపాలన అధికారుల మధ్య బేధాభిప్రాయాలు వచ్చి వాటి నియామకాలు ఆగిపోయాయి. ఈక్రమంలో సదరు ఔట్ సోర్సింగ్ కాంట్రాక్టర్ 16 మంది నియామకాలు చేపట్టేలా ఆర్డర్ కాపీలు కార్మికులకు అందించారు. కానీ పరిపాలన అధికారులు పలు కారణాలు చూపి అడ్డుకున్నారు. దీంతో కార్మికులు సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. చివరకు పరిపాలన అధికారులు కాంట్రాక్టర్, కార్మికులతో చర్చలు జరిపి విధుల్లోకి తీసుకున్నారు.

బయోవేస్ట్ ప్లాంట్ ఏర్పాటు చేయొద్దు



ఆందోళన చేస్తున్న పీచర గ్రామస్తులు

ధర్మసాగర్(వేలేరు): వేలేరు మండలం పీచర గ్రామంలో కామన్ బయో మెడికల్ వేస్ట్ ట్రీట్మెంట్ ఫెసిలిటీ ప్రాజెక్టు ఏర్పాటును రద్దు చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ప్రాజెక్టు ఏర్పాటు నేపథ్యంలో తెలంగాణ పొల్యూషన్ బోర్డు స్టేట్ లెవల్ ఎన్విరాల్మెంట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ అథారిటీ, పర్యావరణ, అటవీ వాతావరణ మార్పు శాఖల అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ కోసం శుక్రవారం గ్రామానికి వస్తున్నారనే సమాచారంతో పీచర గ్రామ ప్రజలతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ప్రతిపాదిత భూమి వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ మ్యాక రవీందర్ మాట్లాడుతూ.. మెడికల్ వేస్ట్ ప్లాంట్ ఏర్పాటుతో మానవాళి మనగడపై తీవ్ర ప్రభావం పడుతుందన్నారు. ప్లాంట్ ఏర్పాటును విరమించుకోవాలని, లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. విషయం తెలుసుకున్న ధర్మసాగర్ సీఐ ఒంటేరు రమేష్, వేలేరు ఎస్సై నవీన్‌కుమార్‌లు ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళనను విరమించాలని ప్రజలకు సూచించారు. కాగా, ప్రజల ఆందోళన విషయం తెలుసుకున్న అధికారులు ప్రజాభిప్రాయ సేకరణకు రాలేదు. దీంతో గ్రామస్తులు సాయంత్రం వరకు వేచి చూసి వెళ్లిపోయారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ గుజ్జుల రాంగోపాల్‌రెడ్డి, ఎంపీటీసీ జల్తార్ సంపత్, ఉప సర్పంచ్ శ్రీధర్‌రెడ్డి, ప్రమోద్‌రెడ్డి, నర్సింగరావు, కీర్తి వెంకటేశ్వర్లు, కనకయ్య, బైరబోయిన గట్టయ్య, మారబోయిన రాజు, వివిధ గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఐ సతీశ్ అరెస్ట్

14 రోజుల రిమాండ్

వరంగల్ క్రైం: వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో రిజర్వ్‌డ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న సతీశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సుబేదారి ఇన్‌స్పెక్టర్ షుకుర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ఈనెల 3న శ్రీరాఘవేంద్ర లాడ్జిలో ఎల్‌బీ నగర్‌కు చెందిన రంగురాళ్ల వ్యాపారిని బెదిరించి డబ్బులు లాక్కున్నట్లు ఆయన తెలిపారు. బాధితుడు ఎండీ జబ్బార్ అలీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సతీశ్‌ను రిమాండ్‌కు తరలించగా.. 14 రోజుల పాటు జైలుశిక్ష పడినట్లు ఆయన పేర్కొన్నారు.



ఇక్కడ కాబోయే వైద్యులు వసతి పొందుతుంటారు. రోగాలను నయం చేసే వీరికి ఇప్పుడు కొత్త రోగాలు వచ్చే పరిస్థితి ఉంది. వరంగల్ నగరంలోని కాకతీయ మెడికల్ కాలేజీలోని వివేకానంద (మెన్స్) హాస్టళ్లలోని దుస్థితి ఇది. చెత్తాచెదారం పేరుకుపోయింది. పిల్లర్లు, భవనం పైకప్పు పెచ్చులు ఊడిపోతున్నాయి. ట్యూబ్‌లైట్లను పట్టించుకునే వారేలేరు. కిటికీలు పాడైపోయాయి. భవనం వెనుకభాగం మొత్తం తడిసి పాకురు పట్టింది. చెట్లు కూడా పెరిగి ప్రమాదకరంగా మారాయి. మరి అధికారులు ఇప్పటికైనా స్పందించి శుభ్రం చేయిస్తారో లేదో చూడాలి.
- సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, వరంగల్

రామ్‌రాజ్ కాటన్ షోరూం ప్రారంభం



రామ్‌రాజ్ షోరూంను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జమున

జనగామ: జనగామ జిల్లా కేంద్రం సూర్యాపేట రోడ్డులో ఏర్పాటు చేసిన రామ్‌రాజ్ కాటన్ షోరూంను శుక్రవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జమునలింగయ్య ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ నాణ్యత, సంప్రదాయ వస్త్ర ప్రపంచానికి పెట్టింది పేరుగా నిలిచిన రామ్‌రాజ్ షోరూం జనగామలో ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. నిర్వాహకులు మాట్లాడుతూ రామ్‌రాజ్ కాటన్ నిపుణుల పర్యవేక్షణలో మృధువైన వస్త్రాలు అన్ని రంగుల్లో తయారు చేస్తున్నామని.. మహిళలు, పురుషులు, చిన్నారులకు కావా ల్సిన దుస్తులు మా షోరూంలో అందుబాటులో ఉన్నాయన్నారు. షోరూం ప్రారంభోత్సవం సందర్భంగా రామ్‌రాజ్ కాటన్ ఫౌండర్, చైర్మన్ కేఆర్ నాగరాజన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ వాంకుడోతు అనిత, బండ పద్మ, ప్రముఖులు నగేష్, పజ్జూరి జయహరి, బండ యాదగిరిరెడ్డి, మాశెట్టి వెంకన్న, బచ్చు రమేష్, బచ్చు పవన్, పజ్జూరి జయహరి, యాంసాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

పదేళ్ల బాలికపై అత్యాచారయత్నం

- నిందితుడిపై పోక్సో కేసు



నిందితుడి అరెస్ట్ చూపుతున్న సీఐ రాఘవేందర్

స్టేషన్‌ఘన్‌పూర్: జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం సముద్రాల గ్రామానికి చెందిన పులి రజనీకుమార్ అనే యువకుడు సమీప గ్రామానికి చెందిన పదేళ్ల బాలికపై అత్యాచారయత్నం చేశాడు. బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు యువకుడిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఈ ఘటన ఆలస్యంగా శుక్రవారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సముద్రాలకు చెందిన రజనీకుమార్ సమీప గ్రామంలోని అతడి అక్క(పెద్దమ్మబిడ్డ) ఇంటికి ఈనెల 1న చుట్టపుచూపుగా వెళ్లాడు. ఈనెల 2న ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆమె కుమార్తె వరుసకు కోడలైన పదేళ్ల బాలికపై అత్యాచారయత్నం చేయగా బాలిక గట్టిగా అరవడంతో పారిపోయాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ రాఘవేందర్ తెలిపారు. కాగా, నిందితుడిని శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.



దోర్నకల్ రైల్వేస్టేషన్ ఆవరణలో సేదతీరుతున్న కూలీలు



మహారాష్ట్ర టు మానుకోట

మహారాష్ట్ర కూలీలు మహబూబాబాద్ జిల్లాకు తరలివస్తున్నారు. మానుకోటతో పాటు దోర్నకల్‌లో రైళ్లు దిగి.. మిర్చి తోటల్లో పనులకు గ్రామాలకు వెళ్తున్నారు. కాగా మహారాష్ట్ర నుంచి కుటుంబసమేతంగా జిల్లాకు చేరుకొని రెండు మూడు నెలలపాటు మిర్చి తోటలోనే గుడారాలు వేసుకొని కోతలు ముగిసిన అనంతరం తిరిగి స్వస్థలాలకు వెళ్తారు.

-దోర్నకల్/సాక్షి, స్టాఫ్ ఫొటోగ్రాఫర్, మహబూబాబాద్





మహబూబాబాద్ జిల్లా కేంద్రంగుండా శుక్రవారం వాహనాలలో కిక్కిరిసి వెళ్తున్న కూలీలు

నలుగురు వాహనదారులపై చీటింగ్ కేసు

కాజీపేట: కాజీపేటలోని ఫాతిమా జంక్షన్ వద్ద ట్రాఫిక్ పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా నంబర్ ప్లేట్ ట్యాంపరింగ్ చేసి తిరుగుతున్న నలుగురిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు. ట్రాఫిక్ ఎస్సై రాజేష్ వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో మహేందర్, చెవ్వ సాంబరాజు, గబ్బెట కిరణ్, మునిగంటి రవికుమార్‌లు నంబర్ ప్లేట్ ట్యాంపరింగ్‌కు పాల్పడినట్లు వెల్లడైందన్నారు. ఎస్సై ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

యువతిని బ్లాక్ మెయిల్ చేస్తున్న యువకుడిపై..

యువతిని బ్లాక్ మెయిల్ చేస్తూ శారీరకంగా వాడుకుంటున్న యువకుడిపై కేసు నమోదు చేసినట్లు కాజీపేట ఇన్‌స్పెక్టర్ గట్ల మహేందర్ రెడ్డి శుక్రవారం రాత్రి తెలిపారు. వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం అన్నారం తండాకు చెందిన వాంకుడోత్ చంద్ర మడికొండ సమీపంలోని ఓ దాబా టిఫిన్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. దాబా సమీపంలో ఉండే యువతితో పరిచయం పెంచుకుని పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా వాడుకున్నాడు. తరచూ ఫోన్ చేయడం, మెసేజ్‌లు పంపించడం గుర్తించిన యువతి తల్లిదండ్రులు తమ కూతురుని తీసుకుని స్వగ్రామానికి వెళ్లిపోయారు. అక్కడికి సైతం వెళ్లిన చంద్ర గదికి రాకపోతే ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో పెడతానని బెదిరింపులకు దిగాడు. దీంతో యువతి తల్లిదండ్రులు కాజీపేట పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మహేందర్‌రెడ్డి వివరించారు.

మృత్యువుతో పోరాడి జూనియర్ లైన్‌మన్ మృతి

కాజీపేట: స్తంభంపై నుంచి జారిపడిన జూనియర్ లైన్‌మన్ ఆవునూరి మధు(29) మృత్యువుతో పోరాడుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. కాజీపేట నిట్ ప్రాంతంలో టీఎస్ ఎన్పీడీసీఎల్‌లో మధు జూనియర్ లైన్‌మన్‌గా పని చేస్తున్నాడు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉందని బుధవారం ఫోన్ రావడంతో స్తంభం ఎక్కి జారి కిందపడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే మధును ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మహేందర్ రెడ్డి తెలిపారు.



మధు (ఫైల్)

ఇంటర్ వర్సిటీ రెజ్లింగ్ పోటీలకు కేయూ జట్టు



కేయూ జట్టుతో స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ సవితాజ్యోత్స్న

కేయూ క్యాంపస్: పూణేలోని సావిత్రిబాయి పూలే యూనివర్సిటీలో ఈ నెల 9 వరకు నిర్వహించబోయే ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ రెజ్లింగ్ ఫ్రీస్టైల్ పోటీలకు కాకతీయ యూనివర్సిటీ మహిళా జట్టును ఎంపిక చేసినట్లు కేయూ స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ డాక్టర్ సవితాజ్యోత్స్న శుక్రవారం తెలిపారు. జట్టులో సుమయ్యత బుస్సం, జె.మాధురి (వరంగల్ కిట్స్ కళాశాల), మనీషా(యూనివర్సిటీ కాలేజీ), ఎస్.పరమేశ్వరి, ఎ.అఖిల, ఎన్.సుస్మిత (టీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ ఉమెన్ వరంగల్ వెస్ట్), కె.అంజలి, పి.వందన, జి.ప్రవళిక(టీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ మంచిర్యాల) ఉన్నారు. వీరికి మేనేజర్‌గా ఆసిఫాబాద్ టీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ(ఉమెన్) ఫిజికల్ డైరెక్టర్ బి.హారిక వ్యవహరిస్తారు.

విజయ డెయిరీ ఉత్పత్తులనే వాడాలి

- ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్



మాట్లాడుతున్న చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్

హన్మకొండ చౌరస్తా: ప్రైవేట్ డెయిరీల పాలలో వైట్‌నర్, యూరియా వంటి రసాయనాలు కలుస్తున్నాయని, మనమంతా స్వచ్ఛమైన విజయ డెయిరీ పాలు, పాల ఉత్పత్తులనే వాడుదామని ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండ అలంకార్ జంక్షన్ సమీపంలోని విజయ డెయిరీ వరంగల్ యూనిట్ ఆవరణలో శుక్రవారం జరిగిన పాడిరైతుల అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నగరంలో విజయ పాల ఉత్పత్తులను అమ్మేందుకు నిరుద్యోగ యువతతో స్టాళ్లు ఏర్పాటు చేయిస్తానని, ట్రై సైకిళ్లు అందజేసి ప్రధాన కూడళ్లలో అమ్మకాలు జరిగేలా చూస్తామని అన్నారు. ఈ మేరకు అన్ని శాఖల అధికారుల సమన్వయంతో త్వరలో కలెక్టర్లతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. విజయ డెయిరీ పాడి రైతుల సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఇరుకు దేవేందర్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, టీజీఏ రాష్ట్ర అధ్యక్షుడు అన్నమనేని జగన్మోహన్‌రావు, విజయ డెయిరీ డీడీ ప్రదీప్‌కుమార్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి వెంకటనారాయణ, వరంగల్ జిల్లా అధికారి బాలకృష్ణ, పశుగణాభివృద్ధి సంస్థ అధికారి డాక్టర్ రఘుబాబు, కార్పొరేటర్లు దేవరకొండ విజయలక్ష్మి, ఇండ్ల నాగేశ్వర్‌రావు, టీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పనికి తగిన వేతనం ఇవ్వాలి

- వర్సిటీలకు నిధులు రెట్టింపు చేయాలి
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి



మహాసభలో మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

కేయూ క్యాంపస్: యూనివర్సిటీల్లో వివిధ కేటగిరీలో పనిచేస్తున్న వారికి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్లగొండ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్ హాల్‌లో జరిగిన తెలంగాణ యూనివర్సిటీస్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ తెలంగాణ రాష్ట్ర 2వ మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. యూనివర్సిటీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, వర్కర్ల సమస్యల పరిష్కారానికి ఐక్య ఉద్యమాలే శరణ్యమన్నారు. యూనివర్సిటీలకు ప్రభుత్వం ఇచ్చే బ్లాక్ గ్రాంట్ సరిపోవడం లేదని, బ్లాక్ గ్రాంట్‌ను రెట్టింపు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం 10శాతం, రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం నిధులను బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయించాలన్నారు. నూతన జాతీయ విద్యా విధానంలో అనేక లోపాలున్నాయని, దానికి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ యూనివర్సిటీల కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్, దినసరి వేతన ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. సభలో ఏపీ ప్రభుత్వ కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్, పార్ట్ టైం ఎంప్లాయీస్ వర్కర్స్ అండ్ టీచర్స్ జేఏసీ చైర్మన్ ఏవీ నాగేశ్వర్‌రావు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జి.వెంకటేష్, ఆల్ ఇండియా యూనివర్సిటీస్ జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్, సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అధ్యక్షుడు ఎ.రామచందర్, జనరల్ సెక్రటరీ పెండ్యాల రవి, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలను నిరోధించాలి



మాట్లాడుతున్న నర్సింహ

మడికొండ: ప్రసార మాధ్యమాలలో మూఢ నమ్మకాలను నిరోధించాల్సిన అవసరముందని ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ అన్నారు. కాజీపేట మండలం మడికొండ శివారు రాజన్నబండ వద్ద నిర్వహిస్తున్న ప్రజానాట్య మండలి జిల్లా శిక్షణ తరగతుల్లో శుక్రవారం రెండో రోజు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ప్రచార మాధ్యమాలలో ద్వారా మూఢ నమ్మకాలు విస్తరిస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియంత్రించకపోవడం శోచనీయం అన్నారు. ప్రతి జిల్లా కేంద్రంలో మినీ రవీంద్ర భారతి నిర్మించాలని, అర్హులైన కళాకారులకు గుర్తింపు కార్డులు, హెల్త్ కార్డులు, బస్సు, రైలు ప్రయాణాల్లో రాయితీలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, ప్రజానాట్య మండలి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ, కేతరాజు ఉప్పలయ్య, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, జిల్లా నాయకుడు రాజమౌళి, ప్రజానాట్యమండలి జిల్లా ప్రధాన కార్యదర్శి కొట్టెపాక రవి, అధ్యక్షుడు గడ్డం రాజనర్సు, మాలోత్ శంకర్, రాసమల్ల దీన, స్వరూప, రాజమణి, రమేష్, మమత, మాధురి, శ్యామ్, రమేష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ విజేత వరంగల్



ట్రోఫీ అందుకుంటున్న వరంగల్ జూనియర్ హ్యాండ్‌బాల్ జట్టు

కాశిబుగ్గ: రెండు రోజులుగా ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి జూనియర్ బాలికల హ్యాండ్‌బాల్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఫైనల్స్‌లో వరంగల్ – హైదరాబాద్ జట్లు తలపడగా 11–10 గోల్స్ తేడాతో వరంగల్ జట్టు ఘన విజయం సాధించి చాంపియన్‌గా నిలవగా హైదరాబాద్ బాలికల జట్టు రెండో స్థానంలో నిలిచింది. అలాగే, మూడోస్థానం కోసం జరిగిన పోటీలో ఖమ్మం-మహబూబ్‌నగర్ జట్ల నడుమ మ్యాచ్ నిర్వహించగా ఖమ్మం విజయం సాధించింది. ఈసందర్భంగా విజేత జట్టుతో పాటు రన్నరప్ జట్లకు ట్రోఫీలు అందజేశారు. డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శ్యామల పవన్‌కుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పోట్ల శ్రీకాంత్, డాక్టర్ పాటిబండ్ల రఘునందన్, మిత్ర ఫౌండేషన్ అధినేత కురెవేళ్ల ప్రవీణ్‌కుమార్‌తో పాటు రాము, శ్రీనివాస్, కృష్ణయ్య, మోహన్ పాల్గొన్నారు.

ముగిసిన పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్



బహుమతులు అందజేస్తున్న ప్రిన్సిపాల్ పోచయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: జనగామ జిల్లా ఘన్‌పూర్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో రెండు రోజులపాటు జరిగిన ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి పాలిటెక్నిక్ కళాశాలల స్పోర్ట్స్ మీట్ శుక్రవారం ముగిసింది. వివిధ కళాశాలల నుంచి 350 మందికిపైగా క్రీడాకారులు హాజరయ్యారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో గెలుపొందిన జట్లు, క్రీడాకారులకు హైదరాబాద్‌లో ఫిబ్రవరిలో స్టేట్ మీట్ ఉంటుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పోచయ్య తెలిపారు. అనంతరం గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ మీట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఇన్‌చార్జ్ పీడీ ఎం.రాజ్‌కుమార్, హెచ్ ట్రిపుల్ ఈ రామక్రిష్ణ, ఏఓ మనోహర్‌రావు, పీఈటీలు వాసుదేవరావు, మనోజ్‌కుమార్, కొండ రవి, వంచ చంద్రశేఖరరెడ్డి, ప్రమోద్‌రెడ్డి, గోపాలకృష్ణ, వేణు, సుధాకర్, కుమార్ పాల్గొన్నారు

రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా జట్టు

వరంగల్ స్పోర్ట్స్: ఖమ్మం జిల్లా కేంద్రంలోని సెయింట్ జోసెఫ్ హైస్కూల్ మైదానంలో శని, ఆదివారం జరగనున్న 5వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సీనియర్ నెట్‌బాల్ పోటీలకు ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సూర్యారావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ నెల 5న కాజీపేటలోని సెయింట్ గాబ్రియల్ స్కూల్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. పురుషుల జట్టులో రాజీవ్, వెంకటేశ్, రాజు, పవన్‌కళ్యాణ్, రాకేష్, బీష్మ, ప్రసాద్, హరి, రమణ, తరుణ్, రత్నకుమార్.. మహిళల జట్టులో రీతూ, దీక్షిత, ఆశ్రిత, వెన్నెల, మీనాక్షి, బ్రిందా, జోత్స్న, గోషియా, సంజూష, ఇషిత, శ్రీచందన, తేజస్వీ ఉన్నారు.

రేపు జిల్లాస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో ఆదివారం(ఈ నెల 8న) ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ ఎంపికలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బి.వీరన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్స్ విభాగంలో బాలబాలికలకు నిర్వహించే ఈ ఎంపికల్లో 19 ఏళ్లలోపు వయసున్న వారు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో ఉదయం 9 గంటలకు జేఎన్‌ఎస్‌లో హాజరుకావాలని సూచించారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు ఈ నెల 12 నుంచి 14వరకు ఖమ్మం జిల్లా కేంద్రంలో జరిగే 67వ తెలంగాణ రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 98492 01467 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

స్కూల్‌కు వెళ్లలేదని తండ్రి మందలిస్తాడేమోనని..

- పురుగుల మందు తాగి విద్యార్థి ఆత్మహత్యాయత్నం.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విష్ణు

కేసముద్రం: స్కూల్‌కు వెళ్లలేదని తండ్రి మందలిస్తాడనే భయంతో విద్యార్థి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం బోడమంచ్యాతండా శివారు గుడితండాలో శుక్రవారం ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికుల కథనం ప్రకారం.. గుడితండాకు చెందిన ధరంసోత్ విష్ణు మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. నాలుగు రోజుల క్రితం బడికి వెళ్లకుండా ఇంటి వద్దే ఉన్నాడు. అప్పటికే ఊరికి వెళ్లిన అతడి తండ్రి రాము తిరిగి ఇంటికి వచ్చాక మందలిస్తాడనే భయంతో ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగి విష్ణు ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు, తండావాసులు మానుకోటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం విష్ణు ఆస్పత్రిలోనే చికిత్స పొందుతున్నాడు.

తలసేమియా బాధితులకు అండగా..

- యువ నేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన్నారుల కోసం రేపు మెగా రక్తదాన శిబిరం



శిబిరంలో రక్తదానం చేస్తూ.. (ఫైల్)

హన్మకొండ కల్చరల్ : తలసేమియా జన్యు సంబంధమైన వ్యాధి. అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఏ వయస్సు వారికైనా వ్యాధి రావొచ్చు. ఈ వ్యాధితో బాధపడుతున్న వారికి 15రోజులకోసారి రక్తం మార్పిడి చేయాలి. లేదంటే వారు చనిపోయే ప్రమాదం ఉంటుంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 200 మంది తలసేమియా వ్యాధిగ్రస్తులు ఉన్నారు. వారికోసం యువ నేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు. సేకరించిన రక్తాన్ని హనుమకొండ సుబేదారిలోని ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్‌లో భద్రపరిచి తలసేమియా వ్యాధితో బాధపడుతున్న వారికి ఉచితంగా అందిస్తున్నారు.

2016 నుంచి..

అత్యవసర సమయాలు, తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు ఉచితంగా రక్తం అందించాలనే ఉద్దేశంతో 2016లో వరంగల్‌కు చెందిన స్విమ్మర్ రాజు, కొత్తకొండ అరుణ్‌కుమార్ కలిసి వరంగల్‌లో యువ నేతాజీ ఫౌండేషన్ నెలకొల్పారు. ఇప్పటి వరకు 31రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి దాతల సహకారంతో 5,071 మందికి ఉచితంగా రక్తం అందించారు. కరోనా సమయంలో ఫౌండేషన్ ద్వారా ప్లాస్మాదానంపై అవగాహన కల్పించి 235 మందితో ప్లాస్మాదానం చేయించారు. కోవిడ్ సమయంలో కేవలం తలసేమియా చిన్నారుల కోసం 22 రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసి 1,254 యూనిట్ల రక్తాన్ని సేకరించి రెడ్‌క్రాస్‌కు అందించారు.

రేపు శిబిరం

స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో తలసేమియా చిన్నారుల కోసం సుబేదారిలోని ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్‌లో ఆదివారం(రేపు) ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నారు. వివరాలకు 94901 15105, 96661 09108 నంబర్లలో సంప్రదించాలని సిమ్మర్ రాజు, కొత్తకొండ అరుణ్ కుమార్ కోరారు.

యువతలో అవగాహన కల్పించాలన్నదే ధ్యేయం...



యువతకు రక్తదానంపై అవగాహన కల్పిస్తూ ఇప్పటి వరకు 30సార్లు రక్తదానం చేశాను. శిబిరంలో సేకరించిన రక్తాన్ని రెడ్‌క్రాస్ బ్లడ్ సెంటర్‌లో భద్రపరిచి సేకరించిన రోజు నుండి 5రోజుల్లో తలసేమియా బాధితులకు ఉపయోగించాలి. లేదంటే వారికి ఉపయోగపడదు. మేము అత్యవసరమైన వారికి రక్తం అందిస్తాం. మాతో పాటు యువతలో అవగాహన కల్పించాలన్నదే మా ధ్యేయం.

- సిమ్మర్ రాజు

తలసేమియా బాధితుల కోసం..



తలసేమియా బాధితులకు ఉపయోగపడాలని నేను 28 సార్లు రక్తదానం చేశాను. దీంతో అత్యవసరమైన వారి ప్రాణాలు కాపాడినవారం అవుతాం. ఆదివారం నిర్వహించే రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి.

- కొత్తకొండ అరుణ్ కుమార్